సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 26 । మే । 2023



పిడుగుపాటుకు రైతు మృతి
పోలవరం మండలం రేపల్లెవాడ గ్రామంలో పిడుగుపాటుకు పొలంలో పనిచేస్తున్న రైతు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈదురుగాలులతో వర్షం కురిసింది. 8లో ▸



పేదల సొంతింటి కల సాకారం
పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. 8లో ▸

నేడు పాలిటెక్నిక్ కళాశాల భవనాల ప్రారంభం
జంగారెడ్డిగూడెంలోని పాలిటెక్నిక్ కళాశాల భవనాలను శుక్రవారం ప్రారంభించనున్నారు. ఐదెకరాల్లో రూ.7.55 కోట్ల వ్యయంతో నూతన భవనాలు నిర్మించారు.
8లో



న్యూస్‌రీల్

జిల్లా పోలీసు సంఘం ఏకగ్రీవం



ఎస్పీని కలిసిన సంఘ సభ్యులు

సాక్షి, భీమవరం: జిల్లా పోలీసు సంఘం గురువారం భీమవరంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా సీహెచ్ ఎస్ మోజేస్ (పాలకొల్లు), ఏజీఎస్ మూర్తి (కాళ్ల) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్. మార్లింగం (పాలకొల్లు), ఎం.నర్సింహరావు (భీమవరం), సంయుక్త కార్యదర్శిగా కేవీవీ సత్యనారాయణ (వీరవాసరం), కార్యనిర్వాహక కార్యదర్శిగా ఐఆర్‌కే రాజు (భీమవరం), కోశాధికారిగా ఎంవీ గంగాధరరావు (నరసాపురం), కార్యవర్గ సభ్యులుగా జె.శివప్రసాద్ (పెనుమంట్ర), ఎ.దుర్గాప్రసాద్ (తణుకు), సీహెచ్‌ఎస్‌కే శేషుకుమార్(భీమవరం), కేవీడీ శంకర్ కాలేపు (ఇరగవరం), జి.అంజనీకుమార్ (భీమవరం), ఎం.అప్పారావు (భీమవరం) ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఎస్పీ యు.రవిప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పక్కాగా సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, భీమవరం: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ జి.ప్రశాంతి అన్నారు. భీమవరం బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ వై.రవికుమార్ ఉన్నారు.

95 శాతం హాజరు : జిల్లాలోని 34 కేంద్రాల్లో 95 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. ఫస్టియర్ జనరల్ కేటగిరీలో 6,096 మంది, ఒకేషనల్ కోర్సుకు 590 మందికి 528 మంది, సెకండియర్ జనరల్ కేటగిరీలో 539 మందికి 474 మంది, ఒకేషనల్ కోర్సుకు 179 మందికి 157 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

భూసార పరీక్ష.. రైతన్నకు భరోసా

- జిల్లాలో 1,000 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం
- తాడేపల్లిగూడెంలో ఉచితంగా మట్టి పరీక్షలు
- మండలాల్లో అవగాహన సదస్సులు
- మూడేళ్లకోసారి తప్పనిసరి

సాక్షి, భీమవరం: భూసారం.. పంటకు కీలకం.. భూమి సారాన్ని పరీక్షించి తెలుసుకొనే పద్ధతిని భూసార పరీక్ష అంటారు. భూమి మొక్కలకు కావాల్సిన పోషకాలను అందిస్తూ మొక్క పెరుగుదలకు, దిగుబడిని అందించడంలో ప్రధాన పాత్ర వహిస్తుంది. రైతు నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవడం ద్వారా ఏ నేలలో ఏ పంట వేస్తే బాగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయో గ్రహించి మంచి దిగుబడులు ఇచ్చే పంటను పండించడానికి అవకాశం ఉంటుంది. అయితే అధిక దిగుబడులు సాధించాలనే పోటీ పెరగడంతో ఎరువుల వాడకం బాగా పెరిగింది. దీంతో దిగుబడులు ఎలా ఉన్నా పెట్టుబడులు పెరగడంతో పాటు నేల చౌడు బారిపోవడం పరిపాటిగా మారింది. భూసారాన్ని బట్టి ఎరువులు వాడితే ఖర్చు తగ్గడంతో పాటు నేల చౌడు బారకుండా కాపాడుకోవచ్చు. ఇందుకు ప్రతి మూడేళ్లకోసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షలను ప్రభుత్వం ఉచితంగా చేస్తున్నందున రైతులు ఉపయోగించుకోవాలని అంటున్నారు.



భీమవరం మండలం యనమదుర్రులో మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

మండలానికి 50 చొప్పున.. జిల్లాలోని 20 మండలాల్లో మండలానికి 50 చొప్పున మొత్తం 1,000 మట్టి నమూనాలు సేకరించి ప్రస్తుత సీజన్‌లో భూసార పరీక్షలు చేయించాలని వ్యవసాయశాఖ అధికారులు నిర్ణయించారు. జిల్లాలో దాదాపు దాళ్వా మాసూళ్లు పూర్తయినందున రైతులు, వ్యవసాయశాఖ అధికారులు భూసార పరీక్షలపై దృష్టి పెట్టారు. ఇప్పటికే మండల, జిల్లాస్థాయిల్లో అవగాహన సదస్సులు నిర్వహించి భూసార పరీక్షల ప్రయోజనాలను వివరిస్తున్నారు. తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ భూసార పరీక్షా కేంద్రంలో ఉచితంగా పరీక్షలు చేస్తున్నారని, వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు



ప్రధానంగా వరి పండించే రైతులకు ఎరువుల వాడకంలో భూసార పరీక్షలు దోహదపడుతున్నాయి. భూసార పరీక్షల ద్వారా ఏ భూమిలో ఎంత మోతాదులో ఏ రకమైన ఎరువు వాడాలనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. ప్రతి మూడేళ్లలోపు భూసార పరీక్షలు చేయించుకోవడం రైతులకు ఉపయోగకరం. మట్టి నమూనాలు సేకరించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎంపీ కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు

మాసూళ్లు పూర్తయిన పొలాల్లో..



జిల్లావ్యాప్తంగా 1,000 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించాలనే లక్ష్యంగా పెట్టుకున్నాం. అయితే ప్రస్తుతం దాళ్వా మాసూళ్లు అన్నిచోట్లా పూర్తి కానందున ముందుగా మాసూళ్లు చేసిన ప్రాంతాల్లో నమూనాలు సేకరిస్తున్నారు. దీనికోసం మండలాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

–జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

మట్టి నమూనాల సేకరణ ఇలా..

- పొలంలో 10 నుంచి 12 చోట్ల మట్టిని సేకరించాలి.
- చెట్ల కింద, గట్లు పక్కన, కంచెల దగ్గర, కాలి బాటల్లో మట్టి నమూనాలు సేకరించరాదు.
- పశువుల, ఎరువు కుప్పల వద్ద, బాగా సారవంతమైన, బాగా నిస్సారంగా ఉన్న చోట్ల కలిపి మట్టి తీయకూడదు.
- చౌడు భూములు, మంచి భూముల్లో కలిపి నమూనాలు సేకరించరాదు.
- రసాయన ఎరువులు వేసిన 45 రోజుల తర్వాతే నమూనా తీయాలి.
- గుంటలు తీసేటప్పుడు పైన ఉన్న చెత్తాచెదారాలను తొలగించి మట్టి పొర తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- బురద నేలలో నమూనా తీయకూడదు.
- భూసార పరీక్షలకు అనుగుణంగా భూమిలో పోషకాలు తక్కువగా ఉంటే వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన ఎరువుల పరిమాణంలో 25 శాతం పెంచి వేసుకోవాలి.
- పోషకాలు ఎక్కువగా ఉంటే 25 శాతం ఎరువులు తగ్గించి వేసుకోవాలి.
- జింకు, ఇనుము, మెగ్నీషియం, బోరాన్ వంటి సూక్ష్మ పోషక లోపాల గురించి కూడా తెలుసుకుని దానికి అనుగుణంగా నివారణ చర్యలు చేపట్టాలి.
- ఇలా చేయడం ద్వారా సాగులో ఎరువుల వాడకం తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.

జగనన్న కాలనీకి విద్యుత్ వెలుగులు

కాళ్ల: పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణానికి ప్రభుత్వం అన్నివిధాలా సాయం చేయడంతో పాటు జగనన్న కాలనీలకు సకల వసతులు కల్పిస్తున్నట్టు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. కోలనపల్లి గ్రామంలో జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించేందుకు సుమారు రూ.15 లక్షలతో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరుతో ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. లబ్ధి పొందిన వారంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. నాలుగేళ్లలో సీఎం జగన్ ప్రతిఒక్కరికీ మేలు చేశారన్నారు.



కోలనపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

బాల కార్మికుల గుర్తింపునకు డ్రైవ్

సాక్షి, భీమవరం: బాల కార్మికులతో పనులు చేయిస్తే చర్యలు తీసుకుంటామని నరసాపురం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ లక్ష్మి తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బాలకార్మికుల డ్రైవ్‌లో బాల కార్మికులను గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. అలాగే భిక్షాటన తదితర వృత్తుల్లో ఉన్న బాలలను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. డ్రైవ్‌లో ఆయా యాజమాన్యాలకు కార్మికులకు చెల్లించాల్సిన కనీస వేతనాలపై అవగాహన కల్పించామని చెప్పారు.

వైద్య సేవల్లో గూడెం ఆస్పత్రి ప్రథమం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రజలకు వైద్య సేవలందించడంలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రి నిలిచిందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, ఆస్పత్రి అభివృద్ధి సలహా సంఘ చైర్మన్ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో గురువారం ఆస్పత్రి అభివృద్ధి సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించారు. వైద్యసేవలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖచే ఈ ఆస్పత్రికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ఈ మేరకు ఒక్కో బెడ్‌కు అదనంగా రూ.10 వేల చొప్పున మూడేళ్ల పాటు నిధులు వస్తాయన్నారు. అలాగే కాయకల్ప విభాగంలో మూడేళ్ల పాటు నగదు అవార్డులు అందజేస్తారన్నారు. కంటి చికిత్సకి సంబంధించి కేటరాక్ట్ ఆపరేషన్లు చేసేందుకు సాంకేతిక పరికరాల కొనుగోలుకు కమిటీ ఆమోదించింది. ఎముకల విభాగంలో ఆపరేషన్లు చేసేందుకు డ్రిల్లింగ్ మెషీన్ కొనాలని మంత్రి సూచించారు. సీఎం జగన్ వైద్యరంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఆయన అన్నారు. ఇక్కడి ఆస్పత్రిలోని జిల్లాస్థాయి వైరాలజీ ల్యాబ్‌లో థైరాయిడ్ పరీక్షలు నిర్వహించేందుకు సిబ్బంది నియామకానికి ఆరోగ్య మంత్రి, కమిషనర్లతో చర్చిస్తామన్నారు. రూ.1.40 కోట్లతో జిల్లాస్థాయి ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ పలు రకాలు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విధులకు గైర్హాజరవుతున్న డెర్మటాలజిస్ట్ టి.సురేష్ నాయక్ స్థానంలో మరో వైద్యుడిను నియమించాలని ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్‌కు మెడికల్ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటుకు నిర్ణయించారు. ఆధునికీకరణ పనులకు రూ.40 లక్షలు త్వరితగతిన మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పగడాల సూర్యనారాయణ, కమిటీ సభ్యులు జీఆర్ రెడ్డి, కొలుకులూరి ధర్మరాజు, బోళం రమలక్ష్మి, కర్రి భాస్కరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ ఎంసెట్‌లో ప్రతిభ


కెల్లక మణిశంకర అజయ్, 52వ ర్యాంకు

పాలకొల్లు సెంట్రల్: తెలంగాణ ఎంసెట్‌లో పాలకొల్లు పట్టణానికి చెందిన కెల్లక గంగ మణి శంకర అజయ్ 52వ ర్యాంకు సాధించాడు. పట్టణంలో స్వీట్ షాపు వ్యాపారస్తుడైన కెల్లక శ్రీనివాసు, పుష్పలత దంపతుల పెద్ద కుమారుడు అజయ్. ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాల్లో బైపీసీలో 983 మార్కులు సాధించాడు. తెలంగాణ ఎంసెట్ (అగ్రికల్చరల్ అండ్ ఫార్మసీలో) 52వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం నీట్‌కు ప్రిపేర్ అవుతున్నాడు.

బర్రింకలపాడు అడవిలో అగ్నిప్రమాదం



బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వెదురు ప్లాంటేషన్ కట్టింగ్ అనంతరం మిగిలిన చెత్తకు ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి అడవికి నిప్పు అంటుకుంది. వేసవికాలం కావడంతో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్, బీడి కాల్చి పడవేసి ఉండవచ్చని దీంతో ప్రమాదం సంభవించి ఉండొచ్చని భావిస్తున్నారు. వీఎస్ఎస్, ఫారెస్ట్ అధికారులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు.

సీఎం జగన్‌తో సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): పేదవాడి సొంతింటి కలను నేరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరానికి సంబంధించిన విస్సాకోడేరు లేవుట్‌లో రూ.3.69 కోట్లతో నిర్మించనున్న రోడ్ల పనులకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గురువారం శంకుస్థాపన చేశారు. లేవుట్‌లో ఇల్లు కట్టుకుని గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇళ్లు పరిశీలించి మాట్లాడారు. వారికి ప్రభుత్వం చేసిన మేలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లేవుట్‌లో 107 ఎకరాల భూమిని సేకరించి 3,434 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేశామన్నారు. దాదాపు 1800 మందికి పైగా గృహ నిర్మాణాలు చేపట్టారని, ఇళ్లు పూర్తి చేసుకుని కొంత మంది గృహప్రవేశాలు కూడా చేసుకుని సొంతింటి కల నేరవేరందనే సంతోషంలో ఉన్నారన్నారు. లేవుట్‌లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశామని, త్వరలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గృహ నిర్మాణాల కోసం సుమారుగా 500 మంది వర్కర్లు, హౌసింగ్, మున్సిపల్ అధికారులు పనిచేస్తున్నారన్నారు. 3,116 గృహాలను నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పళ్ల ఏసుబాబును అభినందిస్తున్నానని, మొదటిసారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాడేరు రోడ్డులో 700 వరకు వ్యక్తిగత గృహాలను ఆనాడు ఏసుబాబు నిర్మించారన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పేదవాడి సొంతింటి కల నేరవేరగా ఆయన తనయుడు జగనమోహన్‌రెడ్డి పాలనలో లక్షలాది మంది పేదల సొంతింటి కల నేరవేరస్తున్నారన్నారు.

చంద్రబాబువి నీచ రాజకీయాలు

రాజకీయాల్లో చంద్రబాబు నీచమైన రాజకీయాలకు కేరాఫ్ అని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ విమర్శించారు. తమ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 11 వేల కోట్ల నిధులతో ప్రభుత్వ, ప్రైవేటు భూములను సేకరించి 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇస్తున్నారని, పేదలు అభివృద్ధి చెందుతారనే అక్కసుతో చంద్రబాబు సెంటు స్థలం శవాలు పాతి పెట్టడానికి సరిపోతుందని వ్యాఖ్యానించడం అతని నీచ స్వభావానికి నిదర్శనమన్నారు. మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి తెలుగుదేశం పార్టీని, ముఖ్యమంత్రి పీఠాన్ని లాక్కున్న చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం పెద్ద లెక్క కాదన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలైన నారాయణ, చైతన్యలాంటి విద్యా సంస్థలకు, జయభేరిలాంటి మురళీమోహన్ రియల్ ఎస్టేట్‌లకు చంద్రబాబు అండగా ఉంటూ కొమ్ముకాస్తాడని.. కనీసం పేదవాడికి మేలు చేసే ఆలోచన చేయడన్నారు. చంద్రబాబుకు తోడుగా ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ కూడా ఉన్నారని, ప్రజల కోసం పనిచేసే జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజల మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్.రాజు, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, జేసీఎస్ కన్వీనర్లు నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, గాదిరాజు రామరాజు, మద్దుల కరుణ్‌కుమార్, కట్టా రవి, మాదిరెడ్డి శ్రీనివాస్, కోమటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


విస్సాకోడేరు లేవుట్‌లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి


కట్టా ప్రసాద్(ఫైల్)

భీమడోలు: మండలంలోని అంబర్‌పేట పంచాయతీ శివారు కొండ్రెడ్డినగర్‌కు చెందిన లారీ డ్రైవర్ కట్టా ప్రసాద్(28) అనుమానాస్పద స్థితిలో కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట టోల్‌ప్లాజా వద్ద మృతిచెందాడు. బుధవారం అర్ధరాత్రి ప్రసాద్ లారీ క్యాబిన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. అతను ఉరేసుకునేంత పిరికివాడు కాదని, ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని ఓ వ్యక్తికి చెందిన లారీకి కొంత కాలంగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం లారీలో డ్రింక్స్ బాటిల్స్‌ను లోడ్ చేసుకుని కాత్రోనికోనలో అన్‌లోడ్ చేశాడు. తిరిగి వస్తుండగా ఈతకోట టోల్ ప్లాజా వద్ద ఉరేసుకుని మృతి చెందాడు. అందుకు కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఆరునెలల వయసున్న కుమార్తె ఉంది.

నేడు పాలిటెక్నిక్ కళాశాల భవనాల ప్రారంభం


ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాలు

జంగారెడ్డిగూడెం : స్థానిక ఏలూరు రోడ్‌లోని జల వనరుల శాఖ ప్రాంగణంలో నిర్మించిన జంగారెడ్డిగూడెం పాలిటెక్నిక్ కళాశాల భవనాల్ని శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ పాలిటెక్నిక్ కళాశాలకు ఐదెకరాలు కేటాయించగా, ఈ స్థలంలో రూ. 7.55 కోట్లతో కళాశాల నూతన భవనాలు నిర్మించారు. నాబార్డు ఆర్ఐడీఎఫ్–23 నిధులు మంజూరు కాగా ఈ భవనాల్ని నిర్మించారు. ఈ నెల 26న రవాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పినిపే విశ్వరూప్, చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాతో కలిసి పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. 2008లో మంజూరైన ఈ కళాశాలకు స్థలం కేటాయించకపోవడంతో స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర, కృష్ణ, గుంటూరు, ఇప్పటి తెలంగాణాలోని భద్రాచలం తదితర జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఇక్కడ చదువుకుంటున్నారు. సరైన తరగతి గదులు, ల్యాబ్స్ లేకపోవడంతో ఒక్కపూట తరగతులు జరిగేవి. ప్రాక్టికల్స్ కోసం రాజమండ్రి(బొమ్మూరు), కాకినాడ(ఏపీటీ), నల్లజర్ల తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 13,408 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. గురువారం ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన 69 కేంద్రాల్లో 14320 మంది విద్యార్థులకు 13408 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ -1, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ -2 పరీక్షలు నిర్వహించారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు ఏలూరు జిల్లాలో 24 కేంద్రాల్లో 3210 మంది జనరల్ విద్యార్థులకు 3014 మంది, ఒకేషనల్ విద్యార్థులు 555 మందికి 492 మంది హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 34 కేంద్రాల్లో 6,368 మంది జనరల్ విద్యార్థులకు 6,096 మంది హాజరు కాగా 272 మంది గైర్హాజరయ్యారు. 590 మంది ఒకేషనల్ విద్యార్థులకు 528 మంది హాజరు కాగా 62 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 11 కేంద్రాల్లో 1647 మంది జనరల్ విద్యార్థులకు 1573 మంది, 313 మంది ఒకేషనల్ విద్యార్థులకు 289 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు ఏలూరు జిల్లాలో 24 కేంద్రాల్లో 446 మంది జనరల్ విద్యార్థులకు 374 మంది, ఒకేషనల్ విద్యార్థులు 234 మందికి 197 మంది హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 34 కేంద్రాల్లో 539 మంది జనరల్ విద్యార్థులకు 474 మంది, 179 మంది ఒకేషనల్ విద్యార్థులకు 157 మంది హాజరు, తూర్పుగోదావరి జిల్లాలో 11 కేంద్రాల్లో 167 మంది జనరల్ విద్యార్థులకు 148 మంది, 72 మంది ఒకేషనల్ విద్యార్థులకు 66 మంది హాజరయ్యారు. థియరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.

అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలి


గూడెంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు, న్యాయవాదులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమ్మాయిలు బయట వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు అన్నారు. ఇంటర్నేషనల్ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే సందర్భంగా గురువారం సాయంత్రం బస్సు కాంప్లెక్స్‌లో ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. తొలుత పట్టణంలోని కోర్టు ఆవరణ నుంచి బస్సు కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. జడ్జి ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ పిల్లలు తప్పిపోయినా, ఎవరినో నమ్మి వెళ్ళిపోయినా తల్లిదండ్రులు పడే క్షోభ అనంతమన్నారు. కొందరు ఎంతో మంచిగా, ప్రేమగా మాట్లాడుతూ నమ్మిస్తారని, అలాంటి దుర్మార్గులను ఆడ పిల్లలు నమ్మరాదని తెలిపారు. తల్లిదండ్రులు అందించే ప్రేమకు మించిన ప్రేమ ఎవరూ అందించలేరన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మాకా శ్రీనివాసరావు, చెక్కా ఇజ్రాయిల్ రాజు, రామకృష్ణ, టౌన్, ట్రాఫిక్ ఎస్సైలు మాట్లాడారు.

పిడుగుపాటుకు రైతు మృతి


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పోలవరం రూరల్: పోలవరం మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన కామిశెట్టి వెంకట సుబ్రహ్మణ్య వరప్రసాద్ (51) పొలంలో పనిచేస్తుండగా, పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులతో పాటు పిడుగులతో కూడిన కొద్దిపాటి వర్షం కురిసింది. ఇదే సమయంలో రైతు తన చేలో పనిచేసుకుంటున్నాడు. చినుకులు పడటంతో పక్కనే ఉన్న మామిడిచెట్టు కిందకు చేరాడు. అదే సమయంలో పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై వీఆర్‌వో తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, ఎంపీటీసీ దాపర్తి మోహనరావులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈదురుగాలుల ప్రభావానికి కన్నాపురం అడ్డరోడ్డు నుంచి ప్రగఢపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు విరిగిపోవడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

2024 ఎన్నికల్లో చంద్రబాబుకు రాజకీయ సమాధి

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: కాపులంతా ఏకమై 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు రాజకీయ సమాధి కట్టేస్తామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ.. నాడు చంద్రబాబు కాపులకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఆందోళన చేశారన్నారు. నాడు రైలును చంద్రబాబు తగులబెట్టించి కాపులపై అన్యాయంగా కేసులు పెట్టించాడని విమర్శించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కేసులను ఎత్తివేశారన్నారు. కాపులపై తప్పుడు కేసులు పెట్టారని రైల్వే కోర్టు సైతం స్పష్టం చేసిందని గుర్తు చేశారు.

రైలును కాపులే తగులబెట్టారని చంద్రబాబు వారించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాపులకు ఇంత అన్యాయం చేసి, కేసులు పెట్టించిన చంద్రబాబు నేడు ఉభయగోదావరి జిల్లాల్లోని వారి ఓట్ల కోసం ప్రాకులాడటం విడ్డూరంగా ఉందన్నారు. పవన్ కల్యాణ్‌కు కాపులు ఓట్లేస్తే వాటిని చంద్రబాబు కాళ్ల వద్ద పెట్టేస్తాడని కాపులు భావిస్తున్నారన్నారు. కాపులు అంత అమాయకులు కాదన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు రాజకీయ సమాధి తప్పదని స్పష్టం చేశారు.

గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం : మండలంలోని నవాబుపాలెంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఇద్దరు మహిళల అదృశ్యంపై కేసు నమోదు

పెదపాడు: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ఇద్దరు మహిళల అదృశ్యంపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన ఒక మహిళ మంగళవారం నుంచి కనిపించడం లేదని కేసు నమోదైంది. బంధువుల ఇళ్లల్లో, చుట్టుపక్కలా వెదికినా ఆరా తెలియకపోవడంతో పెదపాడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పెదపాడు గ్రామానికి చెందిన మరో మహిళ బుధవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26 నుంచి దివ్యాంగుల క్రికెట్ పోటీలు

సాక్షి, భీమవరం: రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 26 నుంచి 28 వరకు డాక్టర్ కారుమూరి దివ్యాంగుల ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ, డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోర్ కమిటీ మెంబర్ ఎస్.మధుసూదన్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో సెంట్రల్ జోన్, నార్త్ జోన్, సౌత్ జోన్, కారుమూరి లెవెన్ జట్లు పాల్గొంటున్నాయని, 28న బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ హాజరవుతారని తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేతగా కేకే గ్లోబల్ అకాడమీ


రన్నర్‌గా ట్రోఫీ అందుకున్న వెస్ట్ గోదావరి వారియర్స్ జట్టు

విజయవాడ స్పోర్ట్స్: కేకే గ్లోబల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరుగుతున్న వన్డే క్రికెట్ లీగ్ టోర్నీ ముగిసింది. యనమలకుదురులోని కేకే గ్లోబల్ క్రికెట్ మైదానంలో గురువారం హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో అకాడమీ జట్టు ప్రత్యర్థి వెస్ట్ గోదావరి వారియర్స్‌పై 104 పరుగుల తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కేకే గ్లోబల్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు ఏడు వికెట్లు నష్టపోయి 298 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌లు రేవంత్(126 రన్స్), పవన్(119 రన్స్) అద్భుతమైన సెంచరీలతో రాణించడంతో జట్టు భారీ స్కోరు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో కేకే గ్లోబల్ జట్టు బౌలర్లు వెస్ట్ గోదావరి వారియర్స్ జట్టు బ్యాట్స్‌మెన్‌లను 39.5వ ఓవర్ వద్ద 194 పరుగులకు ఆలౌట్ చేశారు. 119 పరుగులతో పాటు ఒక వికెట్ తీసిన కేకే గ్లోబల్ జట్టు ఆల్‌రౌండర్ పవన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. విజేతలకు తహసీల్దార్ టి.సతీష్, కృష్ణాజిల్లా క్రికెట్ అసోసియేషన్ అడహాక్ కమిటీ కన్వీనర్ రవిశంకర్, హై కోర్టు న్యాయవాది సత్యనారాయణ ట్రోఫీలను అందజేశారు.

2025లో బిచ్చగాడు-3 సినిమా

వెల్లడించిన హీరో విజయ్ ఆంటోనీ


ప్రేక్షకులతో మాట్లాడుతున్న హీరో విజయ్ ఆంటోనీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : బిచ్చగాడు సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులు తనను ఆదరించడం గొప్ప అనుభూతినిచ్చిందని తమిళ హీరో విజయ్ ఆంటోనీ తెలిపారు. ఆయన హీరోగా నటించగా ఇటీవల విడుదలైన బిచ్చగాడు -2 చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా గురువారం ఆయన స్థానిక సాయి బాలాజీ థియేటర్‌లో సందడి చేశారు. థియేటర్‌లోకి వెళ్ళి ప్రేక్షకులను పలకరించారు. బిచ్చగాడు చిత్రంలోని పాటను పాడి ప్రేక్షకులను అలరించారు. అనంతరం మాట్లాడుతూ 2025వ సంవత్సరంలో బిచ్చగాడు -3ని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. తన చిత్రాలను తెలుగు ప్రేక్షకులు విశేషంగా ఆదరించడంపై ఆయన కృతజ్ఞత తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని మంచి చిత్రాలతో తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంటానన్నారు. అనంతరం థియేటర్ వద్దకు వచ్చిన పలువురు బిచ్చగాళ్ళకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట చిత్ర బృందంతో పాటు థియేటర్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చురుగ్గా అభివృద్ధి పనులు



ముత్యాలమ్మ వారి ఆలయంలో జరుగుతున్న ప్రహరీ గోడ, డ్రెయినేజీ నిర్మాణ పనులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం శ్రీముత్యాలమ్మ వారి ఆలయంలో పలు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయంలో పరిపాలన భవనం, చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, డ్రెయినేజీ, అర్చకుల వసతి భవనం నిర్మాణానికి గాను దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కోటి రూపాయలు నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయనున్నట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ తెలిపారు.

సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా

పెంటపాడు: మండలంలోని సీఐటీయు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద బుధవారం నిరసన చేపట్టారు. తాడేపల్లిగూడెం ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద మందులు, పెన్షన్లు, సిక్ వేతనాలు, నిరుద్యోగ భృతి తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ఆసుపత్రి వద్ద డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రోగ నిర్ధారణకు ల్యాబ్ సౌకర్యం కల్పించాలని రోగ నిర్ధారణ పరీక్షలు చేసి పేషెంట్లకు తగిన మందులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లంపల్లి రామకృష్ణ, కె రమేష్, జె శ్రీనివాస్, కరక వెంకట్రావు, కొల్లి రామకృష్ణ, గంట కోటి, పెనగంటి దుర్గా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగి వెంకటసుబ్బయ్య

తాడేపల్లిగూడెం: తన బదిలీ విషయంలో అక్రమం జరిగిందని, ఒకరిద్దరు అధికారి వేధింపుల కారణంగా అనారోగ్యంగా ఉన్న, తనను దూర ప్రాంతానికి మహానందికి బదిలీ చేశారని న్యాయం కోరుతూ వెంకట్రామన్నగూడెంలోని ఉద్యానవర్సిటీ పరిపాలనా భవనం ముందు వెంకటసుబ్బయ్య అనే ఉద్యోగి గురువారం నిరసనకు చేపట్టారు. కె.వెంకటసుబ్బయ్య అనే నాలుగో తరగతి ఉద్యోగి అన్నమయ్య జిల్లా అనంతరాజుపేటలోని ఉద్యాన పరిశోధన స్థానంలో పనిచేసేవాడు. అక్కడి అధికారికి, వెంకటసుబ్బయ్యకు మధ్య వివాదం ఉంది. ఈ నేపథ్యంలో సుబ్బయ్యను వేరే ప్రాంతానికి బదిలీ చేశారు. తన భార్య అనారోగ్యంతో ఉన్న, తనకు ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నా కూడా దూర ప్రాంతానికి బదిలీ చేశారని, తిరిగి తనను అనంతరాజుపేటకు బదిలీ చేసి న్యాయం చేయాలని కోరుతూ ఎండలో గురువారం వర్సిటీ ప్రధాన కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఉద్యోగసంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అహ్మద్ భాష జోక్యం చేసుకొని, రిజిస్ట్రార్ ద్వారా న్యాయం చేయిస్తానని హామీ ఇవ్వడంతో వెంకటసుబ్బయ్య నిరసన విరమించారు. దీనిపై రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులును వివరణ కోరగా, ఉద్యోగి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ప్రజా నాట్యమండలి సేవలు అభినందనీయం



మాదాల రంగారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇరగవరం: ప్రజా నాట్యమండలి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని తూర్పువిప్పర్రు గ్రామంలో సీపీఐ కార్యాలయం వద్ద గురువారం ఇప్టా ప్రజా నాట్య మండలి 75వ వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజా నాట్య మండలి జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా నాట్య మండలి ద్వారా ఎంతో మంది కళాకారులు వెండి తెరకు పరిచయం అయఆయ్యారని తెలిపారు. ప్రజల సమస్యలను వారి భాధలను, సమస్యలను కళలు, నృత్య, వీధి నాటకాలు ద్వారా తెలియాజేస్తు ప్రజలను చైతన్యవంతులను చేస్తుందన్నారు. అనంతరం నటులు కామ్రేడ్ మాదాల రంగారావు చిత్రపటనికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. సీపీఐ నాయకులు నామాన వేంకటేశ్వర్లు, మండల కార్యదర్శి గిద్దా సూర్యనారాయణ, గాయకులు కాటూరి పాండు రంగారావు, పాలురి పెద కాపు, కుడిపూడి వెంకట రెడ్డి, పాల్గొన్నారు.

పేదల పాలిట వరం ఫ్యామిలీ డాక్టర్

- ఇంటి ముంగిటకే ఉచిత వైద్య పరీక్షలు, సేవలు
- ప్రజల హర్షాతిరేకాలు



ముదునూరు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పెంటపాడు: ఫ్యామిలీ డాక్టర్ పథకం పేద, మధ్య తరగతి ప్రజల పాలిట వరంగా మారింది. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆర్థికాభివృద్ధికి, సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం ప్రధానమని గుర్తించింది. ఈ మేరకు నాడు–నేడు ద్వారా ఆయా రంగాలను బలోపేతం చేసింది. ప్రభుత్వం పాఠశాలలను, ప్రైవేటు కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేసింది. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించింది. ఇక వైద్యరంగం విషయానికి వస్తే ప్రజల చెంతకే వైద్య సేవలను తీసుకువెళ్లింది. దానిలో భాగంగానే గతేడాది అక్టోబర్ 22 నుంచి ట్రయల్ రన్ చేపట్టిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఫ్యామిలీ ఫిజీషియన్ పథకాన్ని గత నెల 6 నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఈ పథకంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఏ రోగమొచ్చినా పట్టణాలకే పరుగులు

గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏ చిన్న రోగమొచ్చినా, ఏ పెద్ద జబ్బు చేసిన ప్రాణాలు అరచేత పెట్టుకొని పట్టణాలకు పరుగు పెట్టేవారు. దీర్ఘకాలిక రోగులు, ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేయించుకొనేవారు. గర్భిణులు, బాలింతలు కూడా పరీక్షలు నిమిత్తం పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. పేద ప్రజలు వైద్యం చేయించుకోలేక, మందులు కొనలేక ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా వైద్యులను, సిబ్బంది గ్రామాలకు పంపించి వైద్య పరీక్షలు చేయిస్తోంది. మందులు ఇస్తుంది. మండలానికి ఒక 104 వైద్య సేవల వాహనం ఉండగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్–ఫ్యామిలీ ఫిజీషియన్ పథకంతో మరో వాహనాన్ని ప్రభుత్వం సమకూర్చింది. ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించింది. ఆ బృందం ప్రతి సచివాలంయ పరిధికి నెలకు 2సార్లు వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తుంది. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ వైద్య సేవలు అందిస్తారు. ముఖ్యంగా 104లో ఈసీజీ, గర్భిణులకు పీటల్‌హార్ట్, రేట్ మానిటర్, హెచ్‌బీ వంటి టెస్టులు 14 రకాల టెస్టులు, 90రకాల మందులు ఇస్తున్నారు. స్థానికంగా సాధ్యం కాని వైద్య సేవలకు భీమవరం, తణుకు ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో వైద్య బృందాలు వచ్చేటప్పటికీ విశేష స్పందన కనిపిస్తోంది. ఈ విధానంతో గ్రామాల్లో రోగులు ప్రభుత్వ డాక్టర్లు అందించే సేవలకు అలవాటు పడ్డారు.

లక్ష్యం మేరకు సేవలు



ప్రభుత్వ లక్ష్యం మేరకు గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం గ్రామ సచివాలయాల పరిధిలో సిబ్బందితో వెళ్లి ఓపీ నిర్వహిస్తున్నాం. వివిధ పరీక్షలతో పాటు అన్ని రకాల రోగులకు వైద్య సేవలందిస్తున్నాం. ప్రభుత్వం అన్ని రకాల మందులు సరఫరా చేయగా పెషెంట్లకు అవసరమైన మందులు అందజేస్తున్నాం. ఆరోగ్యశ్రీ శ్రస్త చికిత్సలు చేయించుకున్న వారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తుల ఆరోగ్యంపై పాలోఅఫ్ చేస్తున్నాం. ప్రజలు కూడా అందుబాటులోకి వచ్చిన సేవలకు అలవాటుపడ్డారు.

– డాక్టర్ ఎస్‌వీ. రమణ, ముదునూరు పీహెచ్‌సీ

అందుబాటులో వైద్య సేవలు



గతంలో ఏ చిన్న వ్యాధికి గురైనా భీమవరం, తణుకు, విజయవాడ వంటి దూర ప్రాంతాల్లో ఆస్పత్రులకు ఎన్నో వ్యయ ప్రయాసలతో వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సీఎం జగన్ ప్రభుత్వం పుణ్యమా అని ఆబాధ లేకుండా వైద్యులతో సహా సిబ్బంది మా ఇంటి దగ్గరకే వచ్చి వైద్య సేవలందిస్తున్నారు. మందులిస్తున్నారు. గ్రామానికి ఇంటికి వైద్యులు వస్తున్న ఈ పథకం చాలా మందికి ఉపయోగంగా ఉంది.

– గొర్లైల కోటేశ్వరరావు, పరిమెళ్ల

కపర్ది ఆశయసాధనకు కృషి చేయాలి



కపర్ది విగ్రహం వద్ద నివాళ్లుర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా శ్రమించిన కమ్యూనిస్టు యోధుడు కపర్ది ఆశయసాధనకు కృషి చేయాలని పలువురు కార్మిక నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ, కార్మికోద్యమ నేత ఎంవీఎస్ కపర్ది వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కపర్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, కార్మిక హక్కుల సాధనకు కపర్ది అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. ఆర్టీసీ జాతీయకరణలో కపర్ది కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పడాల శ్రీనివాస్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తాడికొండ శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు కళింగ లక్ష్మణరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో...

పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో కపర్ది 42వ వర్ధంతిని టౌన్ కార్యదర్శి మండల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కపర్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లం రాము, తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



మానవత సంస్థ సేవల డైరీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి, నాయకులు

తణుకు టౌన్: మానవత స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న సేవలు అభినందనీయమని షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ అధినేత ఎస్.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం తణుకులోని రోటరీ క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి మానవత సంస్థ అధ్యక్షుడు అలపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రాధాపుష్పావతి మాట్లాడుతూ మానవత సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాలకు స్పందించి సీఎస్ఆర్ ఫండ్స్‌లో భాగంగా ఎస్.విశ్వేశ్వరరెడ్డి రూ. 1 కోటి విరాళంగా అందజేశారని తెలిపారు. ఈ మొత్తాన్నికి సంబంధించిన చెక్కును మానవత సెంట్రల్ కమిటీ చైర్మన్ ఎన్ రామచంద్రారెడ్డికి అందజేసినట్లు తెలిపారు. ఈనిధులతో రాష్ట్రంలో మానవత నూతన మండల యూనిట్ల అభివృద్ధికి ఈ నిధులను వెచ్చించాలని కోరినట్లు తెలిపారు. ఇప్పటికే మానవత సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా 95 మండలాల్లో 45 వేల మంది సభ్యులతో పని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవత సంస్థ సమాజ సేవ కోసం 55 శాంతి రథాలు, 545 ఫ్రీజర్లు, 10 అంబులెన్స్‌లు, 25 వాటర్ ట్యాంకర్లతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా మానవత సంస్థ సేవలకు తోడ్పాటును అందిస్తున్న శ్రీ షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ అధినేత ఎస్ విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మానవత సేవలకు సంబంధించిన డైరీని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సెంట్రల్ కమిటీ డైరెక్టర్ గమిని రాంబాబు, మండల చైర్మన్ రామకృష్ణ, కన్వీనర్ ఎస్‌వీ సతీష్‌బాబు, ఉపాధ్యక్షుడు ఏ బాలాజీ, కార్యదర్శి కె సత్యనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు



శిక్షణా శిబిరంలో విద్యార్థులకు పలు అంశాలను బోధిస్తున్న విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు



తణుకు మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు చేతి రాత పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్ –1 శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా విజ్ఞాన తరగతులు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుగుతున్నాయి. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరా వు పర్యవేక్షిస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రత్తి వీరాస్వామి, ఎస్.సాల్మన్‌రాజు, గరికపాటి బాపయ్య శర్మ, ఎ.జనార్ధనరావు, పీజీ స్టూడెంట్ ఎన్.కొండలరావులచే గురువారం లెక్క లు, ఇంగ్లీషు గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీషు, తెలుగు పద్యాలు, సోషల్ స్టడీస్, స్వామి వివేకానంద చరిత్ర, యువజన సర్వీసెస్, రామకృష్ణ మిషన్‌లపై పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణా శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గురువారం తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, విద్యార్థుతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు యర్రమిల్లి ప్రభాకర్ చేతి రాత పోటీలు నిర్వహించారు. అనంతరం క్రాఫ్ట్ పేపర్‌తో బొమ్మలు తయారు చేసే విధానం, భగవద్గీత శ్లోకాలను నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం వంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, రీసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. గురువారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు గణితంలో మెలకువలు, పుస్తక సమీక్ష, ఇంగ్లీష్ పదాలకు అర్థాలు వివరణ, వంటి వాటితోపాటు కథలు చెప్పడం, యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు పాల్గొన్నారు.

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులతో పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, దినపత్రికలు చదివించారు. విశ్వకర్మ స్కూల్ కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణ శరీరం– ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయిని కె కోమలి విద్యార్థులకు కరెంట్ అఫైర్స్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి వెంకటేశ్వరరావు, ఎం శ్రీదేవి, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- నవాబుపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును, ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994లో మూడవసారి ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యే సరికి చంద్రబాబు ఆయనకు వెన్నుపోటు పొడిచాడని, నేడు ఓట్లు కోసం ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మహానాడులో తీర్మానం చేయాలని నిర్ణయించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఏనాడూ ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేయలేదని గుర్తు చేశారు. చంద్రబాబు అనే దుర్మార్గుడికి ఎవరినైనా వాడుకుని వదిలేయడం అలవాటుగా మారిందన్నారు. అయితే, ఏనాడూ పశ్చాత్తాపం లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలు కోసం 2.10లక్షల కోట్లు వెచ్చించారన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నారంటూ దుష్ప్రచారాలు చేశారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ పథకాలన్ని రద్దు చేస్తామని ప్రచారం చేశారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు గాలికొదిలేసిన సమయంలోనూ రాష్ట్రం అప్పుల్లో ఉందన్నారు. సంక్షేమపథకాలు అమలు చేస్తున్నా చాలా తక్కువ అప్పుల్లో రాష్ట్రం ఉందని స్పష్టం చేశారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా అందరికీ న్యాయం చేస్తుంటే ఓర్వలేకపోతున్నారన్నారు. పైగా తమకు ఓట్లేస్తే ఈ వ్యవస్థలను రద్దు చేస్తామని ప్రజలకు చెబుతున్నారన్నారు. చంద్రబాబుకు ఓట్లేసి సంక్షేమ పథకాలను వదిలేసుకుందామా ?అని ప్రజల్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, ఎమ్పీటీసీలు నార్ని శంకరరావు, మార్లపూడి సుబ్బారావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైవీ.వెంకట్రావు, ఎలక్ట్రికల్ ఏఈ ఎ.రామకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ మద్దుకూరి ఆశాలత, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, పెదగాడి విష్ణు, గెడ్డం లక్ష్మీకుమారి, బండి శ్రీనివాసరావు, బండి సర్వేశ్వరరావు, నున్నా పీటర్, చిట్టూరి బాపన్న, వలంటీర్లు పాల్గొన్నారు.


నేడు గూడెం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగగుంట, కుంచనపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్ శాఖ తాడేపల్లిగూడెం డీఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ కారణంగా అప్పారావుపేట, కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఎల్.అగ్రహారం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణంపై కళాజాత ప్రదర్శన

ఆకివీడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, కాలుష్య కోరల్లో చిక్కుకున్న జీవం మనుగడను రక్షించుకోవలసిన ఆవశ్యకత ఏర్పడిందని కళాజాత కళాకారులు తమ ప్రదర్శన ద్వారా తెలియజేశారు. స్థానిక చేపల మార్కెట్, గుమ్ములూరు సెంటర్ తదితర ప్రాంతాల్లో గురువారం కళాప్రదర్శన నిర్వహించారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం పక్షపాతి



ఎస్‌కే నౌషాద్ మొహిద్దీన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పిందని, గన్నవరం ఎయిర్ పోర్టు నుంచే నేరుగా హజ్‌యాత్రకు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయడం, అభినందనీయమని వైఎస్సార్ సీపీ పట్టణ ముస్లిం, మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కే నౌషాద్ మొహిద్దీన్ కొనియాడారు. ముస్లింలు హజ్ యాత్రను పవిత్రంగా భావిస్తారని, జీవితంలో ఒక్కసారైన ఈ యాత్రకు వెళ్లాలని భావిస్తారని చెప్పారు. ఇప్పటి వరకు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి, అక్కడ నుంచి హజ్‌యాత్రకు వెళ్లేవారిని, నేడు రాష్ట్రంలోని ముస్లింలు కోసం ప్రభుత్వం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచే వెళ్లే విధంగా తగిన ఏర్పాట్లు చేసిందన్నారు. జూన్ 7 నుంచి ఈ యాత్ర ప్రారంభం అవుతుందని, 19 వరకు ఈ యాత్రకు వెళ్తారన్నారు. 1813 మందికి ఒకొక్కరికి రూ 80 వేలు చొప్పున, 14.5 కోట్లు ఆర్థిక సహాయాన్ని ఏపీ ప్రభుత్వం విడుదల చేయడం శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం పక్షపాతి అన్నారు. పేద బలహీన వర్గాల ముస్లింలకు రాయితీ ఇవ్వడం హర్షణీయమని కొనియాడారు.

ముగిసిన సువార్త సభలు

పెంటపాడు: పడాల వాక్యజ్యోతి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి జరుగుతున్న క్రీస్తు సంపూర్ణ సువార్త స్వస్థత సభలు బుధవారం అర్ధరాత్రితో ముగిశాయి. ప్రవర్తిని కొమ్మిశెట్టి అమ్మాజి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభల్లో వరంగల్‌కు చెందిన జె.జెడ్‌సన్ అబ్రహం, విజయవాడకు చెందిన పాల్ ఇమ్మానియేల్, భీమవరానికి చెందిన ఎం.దేవదాసు తదితరులు దేవుని వాక్యం అందించారు. సువార్త గాయకులు జాషువా గరికి కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ధనరాజు, జాజిరాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు రైల్వేగేట్ల మూసివేత


తణుకు: తణుకు అత్తిలి రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఈనెల 26, 27, 28 తేదీల్లో పలు రైల్వే గేట్లు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తణుకు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ పీబీఎస్ ప్రసాద్ తెలిపారు. మండపాక నుంచి బల్లిపాడు మార్గంలో రేలంగి రైల్వే గేటును ఈనెల 26, 27 తేదీల్లో మూసివేస్తున్నట్లు చెప్పారు. మండపాక నుంచి వేల్పూరు వెళ్లే రోడ్డులో రైల్వే గేటును ఈ నెల 27, 28 తేదీల్లో మూసివేస్తున్నట్లు చెప్పారు. ఈ మార్గాల్లో రాకపోకలు పూర్తి నిలిపివేస్తున్నందున వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని కోరారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు



స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మందిరంలో వలంటీర్లకు సన్మానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: వెలకట్టలేని సేవలతో ప్రభుత్వానికి అండగా ఉంటూ సంక్షేమ వారధులుగా వలంటీర్లు నిలుస్తున్నారని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజరపు చంద్రిక అన్నారు. గురువారం మండలంలోని జగన్నాథపురం–1, 2, ఆరుగొలను, కొత్తూరు సచివాలయాల పరిధి వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథపురం సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ వలంటీర్లు నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రావజరపు చంద్రిక అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు నేరుగా అందిస్తున్న ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. రాబోయే రోజుల్లో మరింత చిత్తశుద్ధితో పనిచేసి, పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీలు నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), వార్డు మెంబర్లు అడ్డాల గోపీకృష్ణ, కరిపోతు చినపుల్లారావు, ముప్పిడి లక్ష్మణరావు, నోడల్ ఆఫీసర్ బీవీ ఎస్‌బివి.రాజు, హిమబిందు, పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరెడ్డి, జడ్డు ఫణీంద్రకుమార్, సీహెచ్.శ్రీనివాసచంద్రరాజు, ఉప్పు విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముప్పిడి సంపత్‌కుమార్, చిట్టూరి బాపన్న, తులా మస్తాన్, ముళ్లపూడి రామకృష్ణ, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం–1 సచివాలయం వద్ద వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం పట్టణంలోని 34, 35 వార్డు వలంటీర్లను సత్కరిస్తున్నవట్టి బుజ్జి తదితరులు

వలంటీర్లకు సత్కారం

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో వలంటీర్ల కృషి అభినందనీయమని వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కరరావు అన్నారు. స్థానిక 10, 11, 12, వార్డుల వలంటీర్లు సేవా మిత్ర అవార్డులతో స్థానిక మున్సిపల్ కౌన్సిల్ చాంబర్‌లో సత్కార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలు, ప్రజాప్రయోజన పథకాలను ప్రజలకు వలంటీర్ల ద్వారా అందించడంలో దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఈకార్యక్రమంలో ఎంతః మురళీకృష్ణ, ఆర్‌ఓ ప్రసాద్, అడ్డాల నర్సింహరావు, కోడే శ్రీను, చామన సూర్యచంద్రరావు, ఆయా వార్డుల సెక్రటరీలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక 34,35 వార్డుల్లో వలంటీర్లకు సత్కార కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు అందచేయడానికి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో వట్టి బుజ్జి సిరగం రమాదేవి, వై లక్ష్మీనాయుడు, ఆయా వార్డుల సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.